న్యూఢిల్లీలో వేడుకలకు బిందుసేద్యం రైతులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 24(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఆదివారం జరిగే గణతంత్ర దిన వేడుకలకు ప్రత్యేక అతిథులుగా పుత్తూరు మండలం తొర్రూరు గ్రామానికి చెందిన ఇద్దరు బిందు సేద్యం రైతులు ఎంపికైనట్లు జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి సతీష్ తెలిపారు. బిందు సేద్యంతో పూల తోటలు పెంచుతూ అధిక దిగుబడి సాధించిన గజేంద్ర నాయుడు, ఉషారాణి దంపతులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.



జిల్లా పర్యాటక అభివృద్ధికి ఏడంతస్తుల సాక్ష్యం

అవకాశాలు మెండుగా ఉన్నా జిల్లా పర్యాటక అభివృద్ధి మందగమనంలోనే సాగుతోంది. అందుకు సాక్ష్యమే ఈ భవనం. అలిపిరి దగ్గర, రుయా ఆసుపత్రికి ఎదురుగా అద్భుతమైన హిల్‌వ్యూతో పర్యాటకుల వసతి కోసం 2016లో నిర్మించిన భవనం ఇది. ఎకరా స్థలంలో రూ. 25కోట్ల వ్యయంతో 103గదులున్న ఏడంతస్తుల భవనంలో . 80మంది సీటింగ్ కెపాసిటీతో రెస్టారెంట్ ఏర్పాటు కూడా ఉంది. స్టార్ హోటల్‌గా దీనిని వినియోగంలోకి తీసుకురావాలన్నది ఆలోచన. వ్యవస్థల్లోని వైకల్యం వల్ల అర్థంతరంగా ఇలా ఆగిపోయింది. పూర్తి చేయడానికి మరో రూ11కోట్లు అవసరమని అంచనా వేసి 2023లో ఒక సంస్థకు కేటాయించారు. నెలకు కోటి రూపాయల అద్దె పర్యాటక శాఖకు చెల్లించేలా ఒప్పందంతో నిర్మాణం పూర్తి చేయాలి. ఎందు చేతనో తాపీ సిమెంటు కూడా భవనం గోడలమీద వేయలేదు. మందుబాబులు, మాదకద్రవ్యాలు సేవించేవారికి ఆశ్రయంగా మారింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

మూడు రంగుల కలెక్టరేట్



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివర్ణ విద్యుత్ కాంతులతో కలెక్టరేట్ ముస్తాబైంది. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ నలువైపులా మూడు రంగుల కాంతులతో విరాజిల్లుతోంది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

■ నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

పర్యాటక ఖజానా

ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి విడిపోయి ఏర్పడిన తిరుపతి జిల్లా పర్యాటక కేంద్రాలకు ఖజానా. తిరుమలకు దేశం నలుమూలల నుంచీ వస్తున్న యాత్రికులను ఆకర్షించగలిగితే ఆధ్యాత్మిక క్షేత్రాలు, ఆహ్లాద ప్రదేశాలు కాసుల వాన కురిపిస్తాయి. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకుని నిధులు సమకూర్చుకుంటేనే ఇది సాధ్యం.

- 6లో







ఏనుగు భేల్

అడవిలో నుంచి పాపవినాశనం దారిలోకి వస్తున్న ఏనుగుల గుంపు (ఫైల్ ఫొటోలు)

ఎటు నుంచి ఏ ఏనుగు వస్తుందో.. అని భక్తులతో పాటు టీటీడీ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఘాట్‌తో పాటు తిరుమల పరిసర ప్రాంతాల్లోనూ ఏనుగుల జాడ కనిపిస్తూనే ఉంది. దీంతో మళ్లీ గజరాజుల భయం మొదలైంది. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగకపోయినా, ముందు జాగ్రత్తగా జనసంచారాల్లో ఏనుగులు రాకుండా వైల్డ్‌లైఫ్ అధికారులతో టీటీడీ చర్చలు మొదలు పెట్టింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

- తరచూ తిరుమల ఘాట్, పార్వేటమండపం వద్ద ప్రత్యక్షం
- భయాందోళనకు గురిచేస్తున్న గజరాజులు
- జనావాసాల్లోకి రాకుండా టీటీడీ చర్యలు



మొదటి ఘాట్‌లోకి వస్తున్న ఏనుగు (ఫైల్ ఫొటో)

చిరుతల సంచారం కాస్త తగ్గిందనుకునే లోపే తాజాగా మళ్లీ ఏనుగుల సంచారం అధికారులను కలవర పెడుతోంది. మొదటి ఘాట్‌లో గురువారం ఏనుగులు కనిపించడంతో భక్తులు, టీటీడీ ఆందోళన చెందుతోంది. ప్రస్తుతం తిరుమలకు సమీపంలో 12 ఏనుగులతో ఓ గుంపు, 13 ఏనుగులతో మరో గుంపు సంచరిస్తున్నాయి. ఆహారం, నీటి కోసం ప్రధాన ఏనుగు రూట్‌మ్యాప్ ను సిద్ధం చేసి ముందుకు సాగుతుందని, దానికి అనుగుణంగా మిగిలినవి అనుసరిస్తాయని అధికారులు చెబుతున్నారు. ఇలా.. పార్వేటమండపం, గోగర్భండ్యాం, శ్రీగంధం వనం మీదుగా కాకులకొండ వెనుకనుంచి మామండూరుకు వెళ్లి.. తిరిగి అవ్వాచారి కోన లోయ మీదుగా ఘాట్‌రోడ్డుకు సమీపానికి వస్తున్నాయని అధికారులు గుర్తించారు. ఏనుగుల కదలికలతో భక్తులు హడలిపోతున్న క్రమంలో అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. తిరుమల జనసంచారంలోకి, ఘాట్‌రోడ్లు, కాలినడక మార్గాల్లోకి ఏనుగులు రాకుండా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఇందులో భాగంగానే వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధికారులను టీటీడీ సంప్రదించింది. శుక్రవారం వైల్డ్‌లైఫ్ అధికారుల బృందం పార్వేటమండపం పరిసర ప్రాంతాలతో పాటు ఘాట్‌రోడ్లను పరిశీలించింది. అడవి నుంచి జనావాసాల్లోకి ఏనుగులు రాకుండా రైల్వే పట్టాల తరహాలో ఇనుప రాడ్లతో రైలింగ్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని టీటీడీ వ్యక్తపరిచినట్లు తెలిసింది. ఐదారు అడుగుల ఎత్తులో రెండు వరసలతో రైలింగ్ ఏర్పాటు చేయడం ద్వారా ఏనుగులు తిరుమల పరిసర ప్రాంతాల్లోకి రావనే అభిప్రాయాన్ని టీటీడీ ఫారెస్ట్ అధికారులు వ్యక్తపరిచారు. దీనిపై వైల్డ్‌లైఫ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల 29వ తేదీ వైల్డ్ లైఫ్ ప్రధాన సైంటిస్ట్ తిరుమలకు రానున్నారు. వారంరోజుల్లో ఈ అంశంపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటి వరకు భక్తులపై ఎలాంటి దాడులు చేయకపోయినప్పటికీ వీడియోలు, ఫొటోలు తీస్తున్నవారిని ఏనుగులు తరిమిన ఘటనలు ఉన్నాయి. ఈక్రమంలో భవిష్యత్తులో ఏనుగుల ద్వారా భక్తులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకూడదనే ఉద్దేశ్యంతో టీటీడీ ఏనుగుల సంచారాన్ని జనవాసాల్లో నివారించేదిశగా అడుగులేస్తోంది.

ఏనుగులను తరమడం శ్రేయస్కరం కాదు

ఏనుగులు ఆహారం, నీటి కోసం ఏడాది పాటు ఓ నిర్దేశిత బాటను ముందుగానే ఎంచుకుంటాయి. దానికి అనుగుణంగానే తరచూ కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. నిజానికి వీటి ద్వారా ఎలాంటి ప్రమాదం ఉండదు. ఒకవేళ ఏనుగులు కనిపిస్తే దూరంగా వెళ్లిపోవాలి. వాటిని తరమడం, కర్రలతో వాటి వద్దకు వెళ్లి శబ్దాలు చేయడం శ్రేయస్కరం కాదు. పిల్లలతో ఉన్న ఏనుగులు మరింత ప్రమాదం. ఎక్కడైనా భక్తులు, స్థానికులు, ఉద్యోగులకు ఏనుగులు కనిపిస్తే సమీపంలో భద్రత, ఫారెస్ట్ అధికారులకు సమాచారమివ్వాలి. మేము వాటిని దట్టమైన అడవిలోకి పంపేలా చర్యలు తీసుకుంటాం. జనసంచారంలోకి ఏనుగులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆలోచిస్తున్నాం.

- శ్రీనివాసులు, డీఎఫ్‌వో, టీటీడీ ఫారెస్ట్

పదేళ్లుగా తరచూ సంచారం

తిరుమల పరిసర ప్రాంతాల్లో పదేళ్లుగా ఏనుగుల గుంపులు తరచూ కనిపిస్తున్నాయి. ప్రధానంగా చూస్తే..

- 2015 మార్చిలో ఓ ఏనుగుల గుంపు పార్వేటమండపం వద్దనున్న శ్రీగంధ వనంలో బీభత్సం సృష్టించాయి. ఇనుప కంచె, అక్కడక్కడా నిర్మించిన రాతిగోడను ధ్వంసంచేసి, అనేక చెట్లను నేలకూల్చాయి.
- 2016లోనూ పార్వేటమండపం వద్దనున్న ఓ నీటి గుంట వద్దకు వచ్చిన ఏనుగులు.. రోడ్డుపక్కనున్న చెట్లను కూల్చాయి. ఆ సమయంలో ఫారెస్ట్ అధికారులు పాపవినాశన మార్గాన్ని మూడురోజుల పాటు మూసివేశారు.
- 2018లో శ్రీవారి పాదాల మార్గంలోని మిర్యాలతోట వద్ద ఏనుగుల గుంపు బీభత్సం చేశాయి.
- ఇక, కొవిడ్ సమయంలో ఏనుగుల సంచారం మరింతగా పెరిగిపోయింది. తరచూ తిరుమల సమీపానికి వచ్చి వెళ్లడం సాధారణమైపోయింది. శ్రీవారిపాదాల మార్గంతో పాటు పార్వేటమండపం, గోగర్భం డ్యాం వద్ద ఏనుగులు ఏదో ఒక సందర్భంలో కనిపిస్తూనే ఉన్నాయి. ఇందులో ప్రధానంగా 2022 మార్చి, మే, 2024 ఫిబ్రవరి నెలల్లో పార్వేటమండపం వద్ద కంచె, చెట్లు ధ్వంసం చేసిన ఘటనలున్నాయి. 2024 ఏప్రిల్ నెలలో శిలాతోరణం వద్ద బీభత్సం చేశాయి.
- తిరుమల నుంచి తిరుపతికి వెళ్లే మొదటి ఘాట్‌లోని ఏనుగుల ఆర్చ్ నుంచి ఏడోమైలు మధ్యలో కూడా ఏనుగుల సంచారం సాధారణమైపోయింది. 2020 జూన్ 5న, 2022 ఫిబ్రవరి, మార్చిలో ఘాట్‌రోడ్డులో, అదే నెలలో పాపవినాశనం మార్గంలో కనిపించాయి. 2023 ఏప్రిల్15న, జూన్ 27న కూడా దాదాపు 12 ఏనుగులు ఘాట్ రోడ్డు సమీపానికి వచ్చి భక్తులను హడలెత్తించాయి.
- గతేడాదిలో రెండు సార్లు, తాజాగా గురువారం మరోసారి ఘాట్‌రోడ్డులోని ఏనుగుల ఆర్చ్ వద్ద కనిపించాయి. కొన్ని సందర్భాల్లో రోడ్డు దాటుతున్నాయి. ఈ ఘటనలు భక్తులను కలవరపరుస్తున్నాయి.

గంజాయి, బహిరంగ మద్యపాన నిషేధం

ఇవీ తొలి ప్రాధాన్యాలు

- ప్రజలకు పోలీసులు జవాబుదారీతనంగా ఉండేలా చర్యలు
- రథసప్తమికి తొక్కిసలాటకు వీల్లేకుండా ఏర్పాట్లు
- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన రాజు



తిరుపతి(నేరవిభాగం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): గంజాయి నివారణ, బహిరంగ మద్యపాన నిషేధం.. తన తొలి ప్రాధాన్యాలని నూతన ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. ఇంకా ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో ప్రశాంత వాతావరణం కల్పించే పోలీసు యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తానన్నారు. నూతన ఎస్పీగా నియమితులైన హర్షవర్ధనరాజు శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణా, బహిరంగ మద్యపానం నిషేధంపై ఉక్కుపాదం మోపి బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక బృందాలు నిరంతరం గస్తీ నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ఇప్పటికే జిల్లాలో ఉన్న బృందాలను మరింత బలోపేతం చేస్తామన్నారు. తిరుపతి ప్రజలకు మళ్లీ సేవ చేసే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, డీజీపీ ద్వారకా తిరుమలరావు తనపై ఉంచిన గురుతర బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేర్చుతానన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అటువంటి పొరపాట్లు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటానని ఎస్పీ హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. పోలీసుల్లో ప్రజల పట్ల జవాబుదారీ తనం పెంచడానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో అహర్నిశలు పనిచేసి ప్రజల్లో పోలీసులంటే ఒక నమ్మకం, స్నేహపూర్వక వాతావరణం తీసుకొస్తానన్నారు. సాయంత్రం పూట ప్రతి పోలీసు రోడ్లపై కనపడే విధంగా విజుబుల్ పోలీసింగ్ తీసుకొస్తానన్నారు. తిరుపతిలో ట్రాఫిక్ నియంత్రణకు ఆటో డ్రైవర్లు, వివిధ వాహనాల యజమానులు, నిర్వాహకులతో సమావేశమై చర్యలు చేపడతామన్నారు. కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని ఫ్రీ ట్రాఫిక్ ఏర్పాటు చేయడానికి ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాత ఘటనలు పునరావృతం కాకుండా తిరుమలలో వచ్చే నెల 4న జరగనున్న రథ సప్తమికి అవసరమైన ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసుల్లో మనోధైర్యం తీసుకు వచ్చి వారిలో పనిచేసే వాతావరణం కల్పిస్తామని చెప్పారు. అనంతరం అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, వెంకట్రావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు ఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు. కాగా, ఉదయం తిరుమల శ్రీవారిని ఎస్పీ హర్షవర్ధనరాజు దర్శించుకున్నారు.

కోడిబొచ్చు కథకు ఫుల్‌స్టాప్ పెట్టండి

- అధిష్ఠానం నుంచి అడుగుతున్నారు
- 'వేస్ట్' వాహనాలను సీజ్ చేయండి
- కార్పొరేషన్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి
- పోలీస్, మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే దిశా నిర్దేశం

తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కోడిబొచ్చు కథకు ఫుల్‌స్టాప్ పెట్టాలని, దీనికోసం పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎన్నికల ముందు తిరుపతిలో జరుగుతున్న కోడిబొచ్చు మాఫియాపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రముఖంగా మాట్లాడడంతో సర్వత్రా చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. కూటమి అధికారంలోకి వచ్చినా ఈ మాఫియా కొనసాగడంపై 'ఆంధ్రజ్యోతి'లో 'కోడిబొచ్చు కథ ముగియలేదు', కోడిబొచ్చు కథలో కొత్త ట్విస్ట్' శీర్షికన ప్రచురితమైన కథనాలు జనసేన అధిష్ఠానం దృష్టికి వెళ్లాయి. పార్టీ ఆదేశాలతో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అప్రమత్తమయ్యారు. నగర పరిధిలోని 5 మంది సీఐలు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌తో సమావేశమయ్యారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టిలో కోడిబొచ్చు వ్యవహారం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా కూడా చికెన్ వేస్ట్ అక్రమ రవాణా సాగడం ఏమిటని ప్రశ్నించారు. 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు మీరు చూస్తున్నారు కదా. పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. ఇకపై ఇలాంటివి జరగకుండా చూడండి' అని ఆదేశించారు. ఇటీవల తిరుపతి నుంచి చికెన్ వేస్ట్‌ను నెల్లూరుకు తరలిస్తూ పట్టుకున్న 6 మినీట్రక్కులను ఎందుకు విడిచిపెట్టారని పోలీసులను అడిగినట్లు తెలిసింది. దీనివెనుక ఎంతటి వారున్నా వదిలి పెట్టొద్దని ఎమ్మెల్యే చెప్పినట్టు సమాచారం. చికెన్ వేస్ట్‌తో పాటు కుళ్లిన ఆహార పదార్థాలు, చెడిపోయిన గుడ్లు, చర్మాలు తదితరాలను చేపల పెంపకంలో వినియోగించడానికి వీల్లేదని, ఈ వ్యర్థాల రవాణానూ నిషేధిస్తూ 2016లో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఆయన పోలీసులకు వివరించినట్టు సమాచారం. చికెన్ వేస్ట్ తరలిస్తున్న వాహనాలను పోలీసులు సీజ్ చేస్తే నియంత్రణ సులభమవుతుందన్నారు. ఇన్సినిరేటర్ ద్వారా చికెన్ వేస్ట్‌ను నిర్వీర్యం చేసేందుకు యంత్రాన్ని సిద్ధం చేస్తున్నామని కార్పొరేషన్ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

ఎంతటివారైనా చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే



కోడిబొచ్చు మాఫియా వ్యవహారం తమ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వెళ్లిందని, దీనిపై అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అందుకనే పోలీసులు, మున్సిపల్ అధికారులతో తాను సమావేశమైనట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కోడి బొచ్చు మాఫియాలో ఎంతటి వారున్నా, చివరకు కూటమి నాయకుల జోక్యమున్నా కేసు పెట్టమని ఆదేశాలు ఇచ్చానన్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

స్వర్ణముఖిలోకి వెళ్లకుండా..

ఏర్పేడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మోదుగులపాళెం స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమార్కులు వేసిన రాచబాటను శుక్రవారం అధికారులు తొలగించారు. వాహనాలు వెళ్లకుండా కందకాలు తవ్వించారు. 'ఇసుక అక్రమ రవాణాకు రాచబాట' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన కథనంపై శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి స్పందించారు. ఆయన ఆదేశాలతో తహసీల్దారు భార్గవి తన సిబ్బందితో కందకాలు తవ్వించారు. ఇసుక అక్రమార్కులు వెళ్లకుండా చర్యలు చేపట్టడంతో రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ఐ సుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారి మునస్వామి తదితరులున్నారు.



కందకాలు తవ్వుతున్న రెవెన్యూ అధికారులు

మల్లిమడుగులో ట్రెంచ్‌ల ఏర్పాటు



రేణిగుంట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మల్లిమడుగు రిజర్వాయరు నుంచి మట్టి అక్రమ రవాణాకు అడ్డకట్ట వేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఆ మేరకు శుక్రవారం ట్రెంచ్‌లను ఏర్పాటు చేశారు. మల్లిమడుగు రిజర్వాయరులో మట్టి తవ్వకాలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దారు సురేష్ బాబు ఆదేశాలతో వీఆర్వో బాబు, రెవెన్యూ సిబ్బంది ట్రెంచ్‌ల ఏర్పాటు పనులు చేపట్టారు. రిజర్వాయరులోకి వెళ్లే అన్నిమార్గాల్లో వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.

కల్లుగీత ఉపకులాలకు మద్యం దుకాణాల కేటాయింపు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల్లోని ఉప కులాల వారికి 23 మద్యం దుకాణాలను శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్ లాటరీ తీసి కేటాయించారు. ఉప కులాల ప్రాతిపదికన దుకాణాలు కేటాయించడంతో మొత్తం ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు విజయశేఖర్, జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి, అసిస్టెంట్ ఈఎస్ వాసుదేవ చౌదరి నేతృత్వంలో గీత కార్మికులకు ఉపకులాల ప్రాతిపదికన దుకాణాలు కేటాయించామని జేసీ తెలిపారు. ఈడిగలకు తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు పట్టణాలు, ఓజిలి, తొట్టంబేడు, కేవీబీపురం, ఎర్రావారిపాలెం, డక్కిలి, నారాయణవనం, శ్రీకాళహస్తి, బాలాయపల్లి, తిరుపతి రూరల్, తడ, వరదయ్యపాలెం మండలాలు, గౌడ్ కులానికి దొరవారిసత్రం, నాగలాపురం, చిట్టమూరు మండలాలు, గౌడ కులానికి పుత్తూరు, నాయుడుపేట, గౌండ్ల కులానికి సంబంధించి వాకాడు, పెళ్లకూరు, సూళ్లూరుపేట పట్టణంలో మద్యం దుకాణాలను కేటాయించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి చంద్రశేఖర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య పాల్గొన్నారు.



గీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయిస్తున్న జేసీ



తిరుపతిలో 'అప్పరెల్' మాల్

● దావోస్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసిన ఆ సంస్థ చైర్మన్ నీలేష్ వేద్

తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గ్లోబల్ ఫ్యాషన్ సంస్థ అప్పరెల్ గ్రూప్ తిరుపతిలో లైఫ్‌స్టైల్ ఫ్యాషన్ మాల్‌ను ఏర్పాటుచేసేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. ఆమేరకు దావోస్‌లో మంత్రి నారా లోకేశ్‌ను అప్పరెల్ గ్రూప్ చైర్మన్ నీలేష్ వేద్ కలిసి చర్చించారు. తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి తమ ఇష్టదైవమని ఎప్పటినుంచో తిరుపతిలో ఫ్యాషన్ మాల్ ఏర్పాటుచేయాలని అనుకున్నట్టు చెప్పినట్టు సమాచారం. 24వేలమందికి పైగా ఉద్యోగులు, 85 అంతర్జాతీయ బ్రాండ్లతో 14 దేశాలలో 2300 మాల్స్ ఉన్నాయి. ఉత్తరాదికి చెందిన నీలేష్ తన అప్పరాల్ మాల్‌ను తిరుపతిలో ఏర్పాటుచేస్తే వెయ్యిమందికిపైగా ఉపాధి అవకాశాలతో పాటు నగరానికి సరికొత్త బ్రాండింగ్ వస్తుందని ఫ్యాషన్ ప్రేమికులు చెబుతున్నారు. త్వరలోనే ఆ గ్రూప్ ప్రతినిధులు తిరుపతికి వచ్చి పరిశీలించనున్నట్టు తెలిసింది.

కల్కిట్రస్ట్ భూ ఆక్రమణలపై ఎన్జీటీలో కేసు పెట్టా: నార్నె

తిరుపతి(ఆటోనగర్), జనవరి24(ఆంధ్రజ్యోతి): కల్కి ట్రస్ట్ భూ ఆక్రమణలు, ఆక్రమాలపై మద్రాసు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ)లో కేసు నమోదు చేశామని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బీఎన్ కండ్రిగ మండలం కల్లివెట్టు సమీపం సర్వే నెంబరు 295లోని అంజూరు సమీపంలోని అటవీశాఖలో 20.75 ఎకరాల డీప్ ఫారెస్ట్ భూమిని కల్కి ట్రస్ట్ నిర్వాహకులు ఆక్రమించి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారన్నినరు. దీనిపై అటవీ, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. అందుకని కల్కి ఆశ్రమ నిర్వాహకులు, అటవీ శాఖ అధికారిని బాధ్యులుగా చేసి నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో కేసు వేశామని ఆయన చెప్పారు. డాక్టర్ ఏఆర్ రెడ్డి, బాధితుడు మునిచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.95 కోట్లు


గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 56.225

తలనీలాలు సమర్పించినవారు: 19.588

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం



మన జిల్లా పర్యాటక ఖజానా



పులికాట్‌లో పడవ విహారం

పులికాట్: జిల్లాకు అద్భుతమైన పర్యాటక వరం పులికాట్. 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల ఈ ఉప్పునీటి సరస్సు మీద పర్యాట దృష్టి తగినంతగా పెట్టనేలేదు. తడలో నిర్మించిన పర్యాటక వసతి భవనాలను కనీసం వినియోగంలోకి తీసుకురాలేదు. కేరళ తరహా బ్యాక్‌వాటర్స్ లా పులికాట్‌ను పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి పరిచే అవకాశం చాలా ఉంది.



బీవీపాలెం వద్ద ఇప్పటికీ వినియోగంలోకి రాని రిసార్ట్స్



నేలపట్టు: నేలపట్టుకు, పులికాట్‌కు లక్షల సంఖ్యలో వలస పక్షులు వస్తుంటాయి. పక్షి ప్రేమికులకు అద్భుతమైన ప్రదేశాలు ఇవి. పులికాట్‌లో పక్షుల పండుగ సమయంలో తప్ప పర్యాటకులకు పడవలు అందుబాటులో ఉండవు. నేలపట్టులో పక్షులతోపాటే సందర్శకుల విడిదికి భద్రమైన ఏర్పాట్లు లేవు. ఇక్కడ ఒక రోజంతా కుటుంబాలు ఆహ్లాదంగా గడిపేలా ఏర్పాట్లు, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయగలిగితే ఈ కేంద్రాలు ఆదాయ వనరులుగా మారుతాయి.

తిరుపతి అర్బన్, వాకాడు, తడ- ఆంధ్రజ్యోతి

పర్యాటక ఆదాయం పెంచుకోవడానికి అత్యధిక అవకాశాలున్న జిల్లా తిరుపతి. ఆధ్యాత్మిక పర్యాటకం, ఆహ్లాదకర పర్యాటకం, ఎకోటూరిజం కేంద్రాల అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించుకోగలిగితే భవిష్యత్తు బంగారంగా మారుతుంది. ఆధ్యాత్మిక, ఆహ్లాద క్షేత్రాలు లెక్కకు మిక్కిలిగా జిల్లాలో ఉన్నాయి. విశాలమైన ఆరు వరుసల జాతీయ రహదారిని కలిపేలా వీటికి మంచి రోడ్లు వేయగలిగితే అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా ఇవి మారుతాయి. తిరుమలకు వచ్చే యాత్రీకులను వీటికి మళ్లించేలా టూరిస్ట్ హబ్‌గా తిరుపతి జిల్లాను మలచుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.



గుడిమల్లంలోని పురాతన శివలింగం

ఆధ్యాత్మిక క్షేత్రాలు: తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి వచ్చే యాత్రికులు అదనంగా ఉండి దర్శించుకోగల అద్భుత క్షేత్రాలు జిల్లాలో ఉన్నాయి. క్రీస్తు.పూర్వం నాటి గుడిమల్లం, అద్భుత శిల్పకళాశోభితమైన శ్రీకాళహస్తి, చోళులు నిర్మించిన మన్నారుపోలూరు ఆలయం, మాంబట్టు శివుడి గుడి, పులికాట్ తీరాన పంట్రంగం శివాలయం, నారాయణవనం వంటి క్షేత్రాల ప్రాశస్త్యం తెలిపే సమాచారం ప్రచారంలోకి తీసుకురావడం, ఆ క్షేత్రాలకు వెళ్లే దారులను మెరుగు పరచడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ క్షేత్రాల సందర్శనకు ఆర్టీసీ ప్యాకేజీ టూర్లు నిర్వహించవచ్చు.




మన్నారుపోలూరులోని అరుదైన గరుత్మంతుడి విగ్రహం



పంట్రంగేశ్వరుడి గుడి



మాంబట్టులోని కాశీవిశ్వేశ్వరాలయం




కొండూరుపాలెం బీచ్

ఇన్ని బీచ్‌లున్నాయి: జిల్లాలో 36 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. తూపిలిపాళెం తప్ప ఇతర బీచ్‌లు ప్రజలకు తెలియవు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పరిధిలో అనేక ప్రాంతాలను బీచ్‌లుగా అభివృద్ధి పరచే అవకాశం ఉంది. శ్రీనివాససత్రం, కొండూరుపాళెం, వాడపాళెం, పూడిరాయదొరువు వంటి చోట్ల అద్భుతమైన బీచ్‌లను అభివృద్ధి పరచవచ్చు. ఈ ప్రదేశాలకు వెళ్లేందుకు తగిన రోడ్లు వేయడం ముఖ్యం. బకింగ్‌హాం కెనాల్ సముద్రంలో కలిసే మొగదారి ప్రాంతంలో అనేక బుల్లి దీవులుంటాయి. చెట్లు దట్టంగా ఉన్నవీ, ఒట్టి ఇసుక దిబ్బలూ ఉంటాయి. సందర్శకులు ఆహ్లాదంగా రోజంతా గడపదగ్గ ప్రదేశాలుగా వీటిని రూపొందించవచ్చు. ఇందువల్ల ఆ ప్రాంత మత్స్యకారుల కుటుంబాలకూ ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయి. పులికాట్‌లోనూ, సముద్రంలోనూ దొరికే రొయ్యలూ, చేపల వంటకాలను ప్రచారం చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించవచ్చు.



ట్రెక్కింగ్

శేషాచలం కొండల్లోని అడవులూ, జలపాతాలూ ప్రకృతిప్రియులను అలరిస్తాయి. ఇక్కడి తీర్థాల సందర్శనం గొప్ప అనుభూతిని ఇస్తుంది. దాదాపు పది ట్రెక్కింగ్ టీంలు ఈ కొండల్లోకి తరచూ వెళ్లి వస్తుంటాయి. వీటన్నింటినీ ఒక గొడుగు కిందకు తీసుకువచ్చి, భద్రత కల్పించి మార్గదర్శనం చేస్తే జిల్లా పర్యాటక పటంలో అదనపు వనరుగా అమరుతుంది.



తలకోన జలపాత సౌందర్యం

ఎకో టూరిజం: ప్రకృతిలో మమేకం అయ్యేలా చేసే తలకోన, మామండూరు మన జిల్లాలోనే ఉన్నాయి. చిక్కని అడవులు, జలపాతాలు, గలగలపారే వంకలు, చెంగున దూకే జింకలు ఉండే ఈ ప్రాంతాలు ప్రస్తుతం ఎటో టూరిస్టు కేంద్రాలుగా ఉన్నాయి. ఇక్కడ వసతులు మరింత మెరుగు పరచిపి పిల్లల ఆహ్లాదానికి అనువైన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. భద్రతకు ఢోకా లేని కేంద్రాలుగా వీటి గురించిన ప్రచారం కూడా విస్తృతంగా జరగాలి. కైలాసకోన, బత్తినయ్యకోన, ఉబ్బలమడుగు, సిద్ధులయ్య కోన వంటి జలపాతాలు కూడా జిల్లాలో చాలానే ఉన్నాయి. పర్యాటక ప్రదేశాలుగా వీటి అభివృద్ధికి తగిన ప్రణాళికలు అవసరం.



మామండూరు అడవి అందం



మాధవమాల కొయ్యబొమ్మ

హస్తకళల జిల్లా: హస్తకళలకు కూడా తిరుపతి జిల్లా కాణాచి. శ్రీకాళహస్తి కలంకారీకి ప్రపంచ గుర్తింపు ఉంది. ఫ్యాషన్ రంగంలో ఇప్పుడు కలంకారీ కీలకంగా మారింది. చేనేతకూ జిల్లా ప్రసిద్ధి. పట్టు, కాటన్ చీరలు, లుంగీలు, టవళ్లు, డ్రెస్ మెటీరియల్స్ నేసే ఊళ్లు అనేకం జిల్లాలో ఉన్నాయి. వెంకటగిరి చీరలకు అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. నారాయణవనం, గొల్లపల్లి, మన్నారుపోలూరు, కారిపాకం లలో నేసే వస్త్రాలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోని ప్రఖ్యాత షోరూంల్లో అమ్ముతున్నారు. వీటికి జిల్లాలో ప్రత్యేక అమ్మకపు కేంద్రాలు ఏర్పాటు చేయగలిగితే పర్యాటక ఆదాయంతో పాటూ నేత కార్మికులకూ ఉపయోగం కలుగుతుంది. మాధవమాల కొయ్యబొమ్మలకు నిలయం. శ్రీకాళహస్తిలో, తిరుచానూరులో ఎన్నో రకాల కొయ్యబొమ్మలు తయారు చేస్తారు. రాతి శిల్పాలు చేసే కేంద్రాలు కూడా తిరుపతిలో ఉన్నాయి. వీటన్నింటినీ పర్యాటక ఆదాయ వనరులుగా మార్చుకునే ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంది.



కాళహస్తి కలంకారీసొగసు

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి

● అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య



తిరుపతి(నేరవిభాగం), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పులపాలై.. ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తిరుపతిలో చోటుచేసుకుంది. ఈస్ట్ ఎస్‌ఐ మహేష్ వివరాల మేరకు.. అనంతపురం ఉమ్మడి జిల్లా కదిరికి చెందిన షేక్‌నూర్ మహ్మద్ ముబారక్.. నగరంలోని కరకంబాడిలో ఉంటూ అమర ఆస్పత్రిలో మేల్ స్టాఫ్ నర్సుగా పని చేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన ఇతడు.. లక్షలాది రూపాయలు అప్పులు చేశాడు. వీటిని తీర్చలేకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో శుక్రవారం తిరుపతిలోని ఒక లాడ్జిలో గది అద్దెకు తీసుకుని విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతకూ ఈయన బయటకు రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులు ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిబ్బందితో కలిసి ఎస్‌ఐ మహేష్ అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి చూడగా ముబారక్ మృతిచెంది ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు మృతదేహాన్ని తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక వికలాంగురాలిపై అత్యాచారం

తిరుపతి(నేరవిభాగం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): మానసిక వికలాంగురాలైన బాలికపై ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడిన ఘటన శుక్రవారం తిరుపతి రూరల్‌లో చోటు చేసుకుంది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. మానసిక వికలాంగురాలితో ఆటోడ్రైవర్ శివప్రసాద్ నాయక్ పరిచయం పెంచుకున్నాడు. తరచూ వారి ఇంటికి వెళ్లి వచ్చేవాడు. శుక్రవారం తెల్లవారుజామున ఆ బాలికకు మాయమాటలు చెప్పి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆమె గట్టిగా అరవడంతో బాలిక తల్లి చూసి ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లింది. రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ కేసు నమోదు చేసి, డ్రైవర్‌ను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ

రామచంద్రాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10గంటలకు ఆర్‌సీపురంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తహసీల్దారు వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, బీఎల్వోలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

'బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని'కి రూ.పది లక్షల విరాళం

తిరుమల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని 'బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని' పథకానికి శుక్రవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. కోడెల శివప్రసాదరావు తనయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ ఈ విరాళాన్ని అందజేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా కోడెల శివప్రసాదరావు ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఈ విరాళాన్ని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి శుక్రవారం తిరుమలలో అందజేశారు. కోడెల ఆశయాలకు అనుగుణంగా రూ.10 లక్షల విరాళాన్ని పేదల వైద్య సేవలకు అందజేసినట్టు ఆయన తెలిపారు.



కుటుంబ సభ్యులతో విరాళాన్ని అందజేస్తున్న కోడెల శివరామ్

చిన్నారుల భవిష్యత్తును రాజకీయం చేయొద్దు



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

తిరుపతి(వైద్యం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): నిజానిజాలు తెలుసుకోకుండా చిన్నారుల భవిష్యత్తును రాజకీయం చేయడం సబబు కాదని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. నగరిలో లైగింక వేధింపులకు గురై స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని ఆయన శుక్రవారం పరామర్శించారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. మానవీయ కోణంలో చూడాల్సిన ఈ విషయాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని హితవుపలికారు. ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. చిన్నారిపై అత్యాచారం జరిగిందా లేదా అనే విషయాన్ని వైద్య పరీక్షల అనంతరమే వెల్లడిస్తామని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

రుయా అభివృద్ధి కమిటీలో మరో ఇద్దరు సభ్యులు

తిరుపతి(వైద్యం), 24(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా కరణం సందీప్, ఆటో డ్రైవరు ఐఎస్ ఖాజా మోహిద్దీన్‌లను నియమిస్తూ కలెక్టరు వెంకటేశ్వర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో కరణం సందీప్ టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

శ్రీవారి సేవలో..



శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న మద్రాసు హైకోర్టు సీజే జస్టిస్ శ్రీరామ్ కల్పతి రాజేంద్రన్..



తానా అధ్యక్షుడు అంజయ్య చౌదరి



అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి..

తొక్కిసలాటలో మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం



తిరుమల, జనవరి24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన మల్లిక కుటుంబానికి రూ.25 లక్షల పరిహారాన్ని టీటీడీ బోర్డు సభ్యులు శుక్రవారం అందజేశారు. పరిహారం చెక్‌ను మల్లిక కుమారుడు రమేష్‌కు టీటీడీ సభ్యులు నరేష్‌కుమార్, రామ్మూర్తి, శాంతారాం, కృష్ణమూర్తి అందజేశారు. టీటీడీ బోర్డు తీర్మానం ప్రకారం పరిహారం చెల్లించగా, బాధితుల కుటుంబంలో ఒకరికి టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగం ఇచ్చేందుకు వారి కుటుంబ సభ్యుల వివరాలను బోర్డు సభ్యుల బృందం తీసుకుంది.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టుల రక్తదానం

తిరుపతి(వైద్యం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆలిండియా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ 50 ఏళ్ల పూర్తి కావడం, అసోసియేషన్ అధ్యక్షుడు జే.ఎస్.షిండే జన్మదినం సందర్భంగా తిరుపతిలోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టులు స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్విమ్స్ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీబాలాజీ ఫెడ్‌టాప్ కెమిస్ట్ భవనంలో శుక్రవారం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 120 మందికి పైగా రక్తదానం చేశారు. వారిని జిల్లా అధ్యక్షుడు పీవీ రత్నం, కార్యదర్శి రాము గుప్తా అభినందించారు.

గాంధీపురం ఇన్‌చార్జి కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

తిరుపతి రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా సుజాత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు డిప్యుటేషన్‌పై పనిచేసే కార్యదర్శి విజయనిర్మల స్థానంలో చెర్లోపల్లె కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఈమెని ఇన్‌చార్జిగా నియమిస్తూ డీపీవో సుశీలాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు ధనుంజయరాయల్, జిల్లా ప్రధానకార్యదర్శి ధనుంజయ యాదవ్ నేతృత్వంలో పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. కలకడ కృష్ణయ్య, పురంధర్ నాయుడు, శ్రీనివాసులు, రమేష్, కుప్పయ్య, రూపేష్‌యాదవ్, నరసింహ నాయుడు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనంబి సన్నిధికి మలయప్పస్వామి



తిరుమల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని తిరుమలనంబి సన్నిధికి మలయప్పస్వామిని శుక్రవారం సాయంత్రం వేంచేపు చేశారు. తిరుమలలో 25 రోజుల పాటు అధ్యయనోత్సవాలు పూర్తయిన సందర్భంగా మరుసటి రోజు తిరుమలనంబి సన్నిధికి మలయప్పస్వామిని తీసుకురావడం టీటీడీకి ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం సహస్ర దీపాలంకార సేవ అనంతరం శ్రీవారి ఉత్సవమూర్తులను తిరుమలనంబి సన్నిధికి తీసుకెళ్లి వేంచేపు చేశారు. అక్కడ ప్రత్యేక పూజలు, హారతి సమర్పించి తిరిగి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు.

తిరుమలలో కర్ణాటకవాసి అదృశ్యం



సోము గౌడ (ఫైల్ ఫొటో)

తిరుమల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన ఓ కర్ణాటక భక్తుడు కనిపించకుండా పోయాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటకలోని ఉత్తరకన్నడ జిల్లా, బోగదే గ్రామానికి చెందిన సోము గౌడ(60) ఎనిమిది మంది కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 20వ తేదీన తిరుమలకు వచ్చాడు. శ్రీవారిని దర్శించుకునేందుకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోకి ప్రవేశించారు. ఈక్రమంలో తనిఖీల పాయింట్‌లో సోముగౌడ కుటుంబ సభ్యులకు కనిపించకుండా పోయాడు. దీంతో వారు ఆయా పరిసర ప్రాంతాలు, సొంతూరులో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తిరిగి 23వ తేదీన తిరుమలకు చేరుకుని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోముగౌడ వివరాలు తెలిసిన వారు 94407 96769, 0877 2289027 నెంబర్లకు తెలియజేయాలని పోలీసులు శుక్రవారం ఓ ప్రకటన ద్వారా కోరారు.

ఎంత చెప్పినా తీరు మారదు!

- ఆలయానికి సమీపంలో శునకాల సంచారం



ఆలయం, లడ్డూకౌంటర్ల వద్ద శునకం

తిరుమల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కాటేజీలు, హోటళ్లు, బాలాజీనగర్‌తో పాటు భక్తుల క్యూలైన్ల వద్ద కనిపించే శునకాలు ఇప్పుడు ఏకంగా ఆలయం వద్దకే వచ్చేస్తున్నాయి. సాధారణంగా తిరుమలలో శునకాల సంచారం నిషేధం. ఒకవేళ ఎక్కడైనా శునకాలు కనిపిస్తే వాటిని హెల్త్ విభాగం అధికారులు పట్టుకుని తిరుమల నుంచి తిరుపతికి తరలించాలి. అయితే గత కొద్దికాలంగా హెల్త్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో తిరుమలలో శునకాల బెడద అధికమైపోయింది. గత ఏడాదిగా కాటేజీలు, హోటళ్ల వద్ద కనిపించే శునకాలు తాజాగా నారాయణగిరి వద్దనున్న క్యూలైన్ల వద్ద కూడా కనిపించాయి. శుక్రవారమైతే ఓ శునకం ఆలయం ముందు నుంచి పుష్కరిణి మీదుగా లడ్డూకౌంటర్‌కు వెళ్లింది. ఈ శునకాన్ని చూసి పలువురు భక్తులు కరుస్తుందేమోనని హడలిపోయారు. అయితే సిబ్బంది మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరించడం గమనార్హం. ఇప్పటికే ఈ అంశంపై పలుమార్లు వార్తలు, భక్తుల నుంచి విమర్శలు వచ్చినా అధికారుల తీరు మాత్రం మారడం లేదు.

ఎస్వీబీసీలో కల్యాణ వెంకన్న కల్యాణోత్సవాల లైవ్

తిరుమల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి రోజు నిర్వహించే స్వామివారి కల్యాణాన్ని భక్తుల కోరిక మేరకు నెలలో ఒకరోజు ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ఇందులో భాగంగా జనవరి 25, ఫిబ్రవరి1, మార్చి 22, ఏప్రిల్ 19, జూన్ 14, 28, జులై 19, ఆగస్టు 30, సెప్టెంబరు 13, అక్టోబరు11, నవంబరు29, డిసెంబరు 13, 27వ తేదీల్లో కల్యాణ వేంకటేశ్వరస్వామి నిత్య కల్యాణోత్సవాన్ని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

కాండర్ పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ

చంద్రగిరి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, మామండూరు సమీపంలోని కాండర్ పాఠశాలలో తిరుపతి కేంద్రంగా సీబీఎస్ఈ, ఐఎస్‌టీఎం వారు సంయుక్తంగా ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ సర్టిఫికేషన్ కోర్సుపై రెండు రోజుల పాటు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐఎస్‌టీఎం జాయింట్ డైరెక్టర్ నమితా మాలిక్, అడ్వైజర్ ఆన్ రీసెర్చ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్ జెబి రాజన్, అకాడమిక్ డైరెక్టర్ ఢిల్లీ స్కూల్ సునీర్ నాగి, విజయవాడ హెడ్ సీఈవో వి.అరుణలు న్యూ ఎన్ఈపీకి అనుగుణంగా ఉపాధ్యాయులకు ఎలా తర్ఫీదు ఇవ్వాలనే అంశంపై సరికొత్త బోధనా పద్ధతులను వివరించారు. కాండర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెన్యూ, డైరెక్టర్ ఆకుల నాగశ్వేత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని 220కేవీ, రేణిగుంట 132కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. పానకం, వేమూరు, గంగనగుంట, మిట్టమీదకండ్రిగ, కస్తూరికండ్రిగ, ముండ్లపూడి ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి మహిళా చిత్రకళా ప్రదర్శన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం నుంచి రెండు రోజుల పాటు మహిళా చిత్రకళా ప్రదర్శన (ఉమెన్ ఆర్ట్ ఎగ్జిబిషన్) నిర్వహించనున్నారు. శ్రీపద్మావతి చిత్రాలయం ఆధ్వర్యంలో ఉదయం 10.45 గంటలకు హోటల్ ఉదయీ ఇంటర్నేషనల్‌లో ప్రారంభం కానుంది. పద్మావతి మహిళా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వి. దుర్గాభవాని, ప్రముఖ రచయిత డాక్టర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు ప్రారంభించనున్నారు. ఇందులో బి.కిరణ్‌కుమారి, బత్తుల అర్చన, జి.గాయత్రి దేవి, రాగిమాను శ్రీదేవి, సలదగు లావణ్య, ఎం.సాయిదివ్య రూపొందించిన పెయింటింగ్స్‌ను ఈ ప్రదర్శనలో ఉంచనున్నారు. ఎగ్జిబిషన్‌తో పాటు విక్రయాలు చేపడతారు. చిత్ర కళాభిమానులు ఈ ప్రదర్శనను తిలకించాలని నిర్వాహకులు కోరారు.

సోలార్ విద్యుత్ కనెక్షన్లు పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ వాసురెడ్డి

తిరుపతి(ఆటోనగర్), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ రూరల్ డివిజన్ పరిధిలో సోలార్ విద్యుత్ కనెక్షన్లు పెంచడానికి ఏఈలు కృషి చేయాలని ఈఈ వాసిరెడ్డి అన్నారు. పాత తిరుచానూరు రోడ్డులోని డీఈ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ స్థాయి ఏఈలు, డీఈఈలతో సమీక్షించారు. సమావేశంలో డీఈఈలు జీవన్‌కుమార్‌రెడ్డి, సుధాకర్, సుబ్రమణ్యం, శేషాద్రిరెడ్డి, ఏఈలు ఎల్.చలపతి, పి.రాజేష్, పి.వెంకటరమణ, పుణ్యకోటి, బాలాజీ, హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డ్రైవర్ల దినోత్సవం

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలలో శుక్రవారం డ్రైవర్ల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. తిరుపతి డిపో గ్యారేజీలో ఉదయం డీపీటీవో జి.నరసింహులు ప్రమాద రహిత డ్రైవర్లను పలకరించి అభినందిస్తూ రోజాలను బహూకరించారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఎం బాలాజీ, చాందిని పాల్గొన్నారు. అలిపిరి డిపోలో హెవీ లైసెన్సు రెన్యూవల్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కుసుమ డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డిపో మేనేజర్ హరిబాబు, రాము పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ

తిరుపతి అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సొసైటీ ఫర్ సోషియల్ సర్వీస్ ఆధ్వర్యంలో స్థానిక టంగుటూరి ప్రకాశం పంతులు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లోని 62మంది పదవ తరగతి విద్యార్థులకు జెంబోబాక్స్‌తో కూడిన విద్యాసామగ్రి, వాటర్‌బాటిల్స్ ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం చేతులమీదుగా పంపిణీ చేశారు. సంస్థ కార్యదర్శి ఎస్.సుబ్రహ్మణ్యం, తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు వై.ఎస్.బాబు, జోష్ ప్రాపర్టీస్ అధినేత ఈశ్వర ప్రకాష్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తిరుపతి(గాంధీరోడ్డు), జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ మాడావీధిలోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు అంతర్జాతీయ విద్య, జాతీయ బాలికా దినోత్సవాలను పురస్కరించుకుని గిరిజన నవసమాజ్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బిట్‌బ్యాంక్స్, స్టడీ మెటీరియల్ పంపిణీచేశారు. సంఘ వ్యవస్థాపకఅధ్యక్షుడు శివశంకర్‌నాయక్ బాలికా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. హెచ్ఎం రేవతి, టీచర్లు పాల్గొన్నారు.

కాలం చెల్లిన విశ్రాంతి భవనాల

పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోండి

- ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించిన టీటీడీ ఈవో

తిరుమల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కాలం చెల్లిన విశ్రాంతిగృహాల స్థానంలో పునర్నిర్మాణాలు చేపట్టడానికి కార్యాచరణ రూపొందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుమలలో శుక్రవారం అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఈవో సుదర్శన్, గోవర్ధన్, కళ్యాణి, సీ-టైప్ క్వార్టర్స్, పద్మావతి ప్రాంతంలోని కొన్ని ప్రదేశాలను పరిశీలించి విశ్రాంతి గృహాల తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. సాధారణ భక్తుల సౌకర్యార్థం విశ్రాంతి గృహాల పునర్నిర్మాణాలకు నిర్దిష్ట ప్రణాళికను రూపొందించాలని సీఈ సత్యనారాయణను ఆదేశించారు. విశ్రాంతి గృహాలన్నీ 6 దశాబ్దాల క్రితం నిర్మించడంతో వర్షాకాలంలో లీకేజీలతో భక్తులు అవస్థలు పడుతున్నారని, సరైన పార్కింగ్ సదుపాయాలు, విశాల స్థలాలు లేకపోవడం, భవన నిర్మాణాలు పాత పద్ధతిలో నిర్మించడం ద్వారా భవనాల ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని ఈవో గుర్తించారు. పాత భవనాల్లో లీకేజీలు, అపరిశుభ్రత, పార్కింగ్ తదితర అంశాలపై భక్తుల నుంచి క్రమంగా ఫిర్యాదులు వస్తున్న క్రమంలో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా భవనాలను పునర్నిర్మాణం చేయాలని ఈవో సూచించారు. డిప్యూటీఈవో భాస్కర్, హరీంద్రనాథ్, ఈఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



విశ్రాంతి గృహాలను పరిశీలిస్తున్న ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయండి



ఆటోనగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపయోగకరమైన అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని ఆటోనగర్, కృష్ణారెడ్డి కాలనీ, అంబేద్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ ఉమా అజయ్, అధికారులతో కలసి పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పారిశుధ్యం మెరుగ్గా చేపట్టాలని, మురుగునీటి కాలువలు మరమ్మతులకు గురై నీరు రోడ్లపైకి వస్తున్నాయని, తాగునీరు ఒకే సమయంలో సరఫరా చేయాలని స్థానికులు కోరారు. ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈ గోమతి, డీఈ రమణ, ఎంహెచ్‌వో డాక్టర్‌యువ అన్వేష్, ఏసీపీ బాలాజి పాల్గొన్నారు.

రేపు విశ్వంలో ఆర్ఐఎంసీ ఉచిత అవగాహన సదస్సు

తిరుపతి(గాంధీరోడ్డు), జనవరి 24(ఆంధ్రజ్యోతి): వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్(ఆర్ఐఎంసీ) ప్రవేశపరీక్షకు సంబంధించి ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. 7, 8 తరగతులు చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరై ప్రవేశపరీక్ష వివరాలు, ఇతర సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం 86888 88802/03, 93999 76999 లను సంప్రదించాలని కోరారు.

బీస్ డైరీ ఆవిష్కరణ



తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి (బీస్) డైరీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ఓ హోటల్లో ఆవిష్కరించారు. వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న బలిజ ఉద్యోగులు ఏకమై పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడాన్ని ఎమ్మెల్యే అభినందించారు. మాజీ ఎమ్మెల్యే మోహన్, బీస్ నాయకులు మునిశంకరయ్య, నీలం నరేంద్రనాథ్, తోకల అశోక్, చక్రధర్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, సురేష్, సాయిసుధాకర్, కిషోర్, ప్రభు, చంద్రశేఖరరావు, బాలాజీ, జయప్రకాశ్, తోట మధుసూదన, మోహన్, నాగరాజు, కిషోర్, వెంకటాద్రి, మురళి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై నేడు సుభాష్ పాలేకర్ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంపై ఎస్వీయూలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ సుభాష్ పాలేకర్ పాల్గొని ప్రసంగించనున్నారు. వీసీ అప్పారావు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, రిజిస్ట్రార్ భూపతినాయుడు, డీఎఫ్‌వో వివేక్ తదితరులు పాల్గొంటారని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ తెలిపారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

భాకరాపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చిన్నగొట్టిగల్లు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం బొల్లినేనివారిపల్లెకు రూ.25 లక్షలతో మంజూరైన సిమెంటు రోడ్డుకు శుక్రవారం భూమి పూజ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో మండలంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, గోకులం షెడ్లు మంజూరైనట్లు తెలిపారు. పీఆర్ ఏఈ సూర్యప్రకాశ్ రెడ్డి, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీల్లో గీతం విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

తిరుపతి(గాంధీరోడ్డు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భవానీనగర్‌లోని గీతం స్కూల్ 8వ తరగతి విద్యార్థి త్రిపురాంబిక అంతర్జాతీయ స్థాయి పాఠశాలల చెస్ పోటీలలో అండర్-13 విభాగంలో రెండవ స్థానం సాధించిందని ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి తెలిపారు. తొమ్మిది రౌండ్లలో 7.5 పాయింట్లు పొంది ట్రోఫీ, నగదు బహుమతి అందుకున్నారని పేర్కొన్నారు. మార్చిలో సెర్బియాలో జరిగే ఫిడే ప్రపంచ పాఠశాలల చెస్ పోటీలకు అర్హత సాధించిందన్నారు. చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు విద్యార్థినిఅభినందించారు. చైర్‌పర్సన్ పాలడుగువిజయ పాల్గొన్నారు.

మంగళం ట్రెండ్స్ పాఠశాలలో దొంగలుపడ్డారు



విరిచేసిన కొళాయిలు

తిరుపతి అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మంగళం ట్రెండ్స్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దొంగలుపడిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. సంక్రాంతిని పురస్కరించుకుని పది రోజులు సెలవు ఇచ్చారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రివేళ గోడదూకి పాఠశాల లోపలికి ప్రవేశించారు. అందుబాటులో ఉన్న వాటిని దోచుకున్నారు. నీటికొళాయిలు విరగొట్టారు. మరుగుదొడ్ల తలుపులను ధ్వంసం చేసి, గాలిమరలను విరిచేశారు. స్టీల్ కొళాయిలను దోచుకెళ్లారు. చివరకు సంపుకున్న ఇనుప కప్పులను కూడా వదల్లేదు. గత సోమవారం పాఠశాలను తెరవగా కొళాయిలు మాయమై ఉండడం గమనించిన ఉపాధ్యాయులు ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేదలకు అన్నదానం



తిరుపతి అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసూతి ఆస్పత్రి వద్ద శుక్రవారం రోగుల బంధువులకు సినీనిర్మాత, బాలాజీ నర్సింగ్‌కాలేజీ చైర్మన్ ప్రవీణ్ ఆధ్వర్యంలో 500మందికి అల్పాహారం అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథి, ఆర్ఎంవో ఆర్ ఆర్ రెడ్డి, శంకర్‌జోన్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌కి 2,274మంది హాజరు

తిరుపతిరూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌కు మూడవ రోజు శుక్రవారం 2,274మంది విద్యార్థులు హాజరయ్యారని సిటీ కోఆర్డినేటర్ టి.కైలాష్‌నాథ్ పేర్కొన్నారు. 2,328మందికి గాను 2,274మంది హాజరవ్వగా 54మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

వీధి వ్యాపారులకు న్యాయం చేయండి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, వీధి వ్యాపారులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలో తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేసుకునే వారిపై దౌర్జన్యం చేయడం సరికాదని, వారికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. నగర పాలక కార్యాలయ ప్రాంగణంలో వీధి వ్యాపారులు శుక్రవారం ధర్నా చేశారు. సంఘీభావం తెలిపిన మురళి మాట్లాడుతూ తోపుడు బండ్ల వ్యాపారుల కోసం 2014లో పార్లమెంట్‌లో చేసిన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అనంతరం కమిషనర్ ఎన్.మౌర్యను కలసి వినతిపత్రం ఇచ్చారు.

సరైన యాజమాన్య పద్ధతులతో అధికదిగుబడులు

చంద్రగిరి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సరైన యాజమాన్య పద్ధతులతో మామిడి పంటలో అధికదిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి దశరథ రామిరెడ్డి రైతులకు సూచించారు. చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలో శుక్రవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మామిడిలో పూత, పిందె దశలో చేపట్టవలసిన సస్య రక్షణ పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఉద్యాన అధికారి దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ డిసెంబర్, జనవరి మాసాల్లో కురిసిన వర్షాలు, రాత్రి, పగటి ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం వలన, ఎరువులు సరైన మోతాదులో అందించకపోవడం వంటి కారణాలతో మామిడిలో పూత రావడానికి అనుకూలంగా లేదని చెప్పారు. చంద్రగిరి ఉద్యాన అధికారి ఎస్.శైలజ, సర్పంచు ఎర్రయ్య, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోహన్‌బాబు యూనివర్శిటీని సందర్శించిన విదేశీ ప్రతినిధులు



విదేశీ ప్రతినిధులను సన్మానిస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు యూనివర్శిటీని మలేషియా, థాయిలాండ్, ఇండోనేషియా, దక్షిణ అమెరికా దేశాలకు చెందిన ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. ఎంబీయూ బృందంతో పాటు ఛాన్స్‌లర్ డాక్టర్ మోహన్‌బాబు, ప్రొవోస్ట్ డాక్టర్ నాగరాజ్ రాంరావ్, వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ కె.కరుణాకరన్, సీజీఎస్వో వికాస్ సింగ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథితో ఈ ప్రతినిధులు రాబోయే పరిశోధనల గురించి చర్చించారు. వారు మాట్లాడుతూ.. నాలుగు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలకు ఎంబీయూ సహకరించి ఉన్నతమైన పరిశోధనలు చేస్తుందని తెలిపారు. అనంతరం మోహన్‌బాబు విదేశీ ప్రతినిధులను సన్మానించారు.

ఘనంగా బాలసుబ్రమణ్యం ప్రమాణస్వీకారం

తిరుపతి రూరల్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎమ్మార్‌పల్లికి చెందిన వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన అయ్యంగారు బాలసుబ్రమణ్యం శుక్రవారం విజయవాడలో ప్రమాణస్వీకారం చేశారు. వన్నియకుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, జనసేన నాయకుల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. తనకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

యూడీఎస్ ఏర్పాటుపై ఐదేళ్లు ఎందుకు చొరవచూపలేదు..!

- తుమ్మలగుంట గ్రామసభలో టీడీపీనేతలు

తిరుపతి రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో సరైన డ్రైనేజీవ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని, గత వైసీపీ ఐదేళ్ల పాలనలో యూడీఎస్ ఏర్పాటుకు చొరవచూపిన పాపానపోలేదని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి విమర్శించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో సర్పంచి సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) గ్రామసభ నిర్వహించారు. ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. యూడీఎస్ ఏర్పాటులో జాప్యం జరుగుతుందని, ప్రత్నామ్నాయ ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై స్పందించిన భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో పంచాయతీలో రూ.9కోట్లతో యూడీఎస్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. వచ్చేనెలలో టెండర్ ప్రక్రియను పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వార్డుసభ్యులు, టీడీపీనేతలు, వీఆర్వో రమేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంచాయతీ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

రామచంద్రాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అధికారులు పంచాయతీల్లో నీరు, వీధిదీపాలు, పారిశుధ్య పనులపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు వారి ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కమ్మపల్లిర, కుప్పంబాదూరు పీహెచ్‌సీ వైద్యులకు సూచించారు. జడ్పీటీసీ ఢిల్లీరాణి మాట్లాడుతూ రాయలచెరువు ముంపు ప్రాంత రైతుల సమస్యను రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. మొరవ కాలువ రైతులకు నష్టపరిహారం అందించి పనులను త్వరతిగతిన పూర్తి చేయాలన్నారు. తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఇందిరమ్మ, అధికారులు పాల్గొన్నారు.

వినాయక సాగర్ షాపులకు ముగిసిన వేలం

తిరుపతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని వినాయకసాగర్ వద్ద నిర్మించిన తిరుపతి నగరపాలక సంస్థకు చెందిన షాపులకు శుక్రవారం బహిరంగ వేలం ప్రక్రియ ముగిసింది. గుడ్‌విల్ కింద కార్పొరేషన్‌కు దాదాపు రూ.80లక్షలు ఆదాయం వచ్చింది. గతంలో నాలుగు సార్లు టెండర్లు పిలిచినా గుడ్‌విల్‌తో పాటు అద్దె ఎక్కువ కావడంతో ఔత్సాహికులు ఎవ్వరూ ముందుకురాకపోవడంతో రద్దయ్యాయి. దీంతో కమిషనర్ మౌర్య గుడ్‌విల్ తగ్గించి టెండర్లను ఆహ్వానించారు. ఒక్కో షాపునకు గుడివిల్ కింద (నాన్ రీఫండబుల్) రూ.5లక్షలు, అద్దె రూ.75వేలుగా నిర్ణయించారు. దీంతో 14 షాపులను బహిరంగ వేలంలో పాల్గొని పలువురు దక్కించుకున్నారు. అదేవిధంగా వినాయకసాగర్ పార్కు, గేమ్‌జోన్‌లను లీజు పద్ధతిపై నిర్వహించిన వేలంకు ఎవ్వరూ హాజరుకాకపోవడంతో వాటిని రద్దు చేశారు. కమిషనర్ ఎన్.మౌర్య ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్‌లు వేలం పాట నిర్వహించారు.

గణతంత్ర ఏర్పాట్లు పక్కాగా చేయండి

తిరుపతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పక్కాగా చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, తుడా వీసీ ఎన్.మౌర్య ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 26న నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను ఆమె శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు.



తిరుపతిలో 'అప్పరెల్' మాల్

● దావోస్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసిన ఆ సంస్థ చైర్మన్ నీలేష్ వేద్

తిరుపతి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గ్లోబల్ ఫ్యాషన్ సంస్థ అప్పరెల్ గ్రూప్ తిరుపతిలో లైఫ్‌స్టైల్ ఫ్యాషన్ మాల్‌ను ఏర్పాటుచేసేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. ఆమేరకు దావోస్‌లో మంత్రి నారా లోకేశ్‌ను అప్పరెల్ గ్రూప్ చైర్మన్ నీలేష్ వేద్ కలిసి చర్చించారు. తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి తమ ఇష్టదైవమని ఎప్పటినుంచో తిరుపతిలో ఫ్యాషన్ మాల్ ఏర్పాటుచేయాలని అనుకున్నట్టు చెప్పినట్టు సమాచారం. 24వేలమందికి పైగా ఉద్యోగులు, 85 అంతర్జాతీయ బ్రాండ్లతో 14 దేశాలలో 2300 మాల్స్ ఉన్నాయి. ఉత్తరాదికి చెందిన నీలేష్ తన అప్పరాల్ మాల్‌ను తిరుపతిలో ఏర్పాటుచేస్తే వెయ్యిమందికిపైగా ఉపాధి అవకాశాలతో పాటు నగరానికి సరికొత్త బ్రాండింగ్ వస్తుందని ఫ్యాషన్ ప్రేమికులు చెబుతున్నారు. త్వరలోనే ఆ గ్రూప్ ప్రతినిధులు తిరుపతికి వచ్చి పరిశీలించనున్నట్టు తెలిసింది.


గంజాయి నిందితులకు రిమాండ్

పిచ్చాటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 400 గ్రాముల గంజాయి పట్టివేత కేసులో ఐదుగురు నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. నిందితుల్లో వెంగళత్తూరుకు చెందిన ఎన్.లావెన్స్(21) హానస్ట్‌రాజ్(22), తిరువళ్లూరు జిల్లా అమ్మంబాక తాలూకా సీతంజేరి గ్రామానికి చెందిన ఈ.సతీష్‌కుమార్ (20), పెన్నలూరుపేటకు చెందిన ఈ.శరత్ (20), ఊత్తుకోట తాలూకా వెల్లతుకోట్టై గ్రామం అరిసానా కాలనీకి చెందిన ఎం.చిన్నమణి (20) ఉన్నారు.

రుయా అభివృద్ధి కమిటీలో మరో ఇద్దరు సభ్యులు

తిరుపతి(వైద్యం), 24(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా కరణం సందీప్, ఆటో డ్రైవరు ఐఎస్ ఖాజా మోహిద్దీన్‌లను నియమిస్తూ కలెక్టరు వెంకటేశ్వర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో కరణం సందీప్ టీడీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

శ్రీహరి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.95 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 56,225

తలనీలాలు సమర్పించినవారు: 19,588

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం



మన జిల్లా పర్యాటక ఖజానా



పులికాట్‌లో పడవ విహారం

పులికాట్: జిల్లాకు అద్భుతమైన పర్యాటక వరం పులికాట్. 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల ఈ ఉప్పునీటి సరస్సు మీద పర్యాట దృష్టి తగినంతగా పెట్టనేలేదు. తడలో నిర్మించిన పర్యాటక వసతి భవనాలను కనీసం వినియోగంలోకి తీసుకురాలేదు. కేరళ తరహా బ్యాక్‌వాటర్స్ లా పులికాట్‌ను పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి పరిచే అవకాశం చాలా ఉంది.



బీవీపాలెం వద్ద ఇప్పటికీ వినియోగంలోకి రాని రిసార్ట్స్



నేలపట్టు: నేలపట్టుకు, పులికాట్‌కు లక్షల సంఖ్యలో వలస పక్షులు వస్తుంటాయి. పక్షి ప్రేమికులకు అద్భుతమైన ప్రదేశాలు ఇవి. పులికాట్‌లో పక్షుల పండుగ సమయంలో తప్ప పర్యాటకులకు పడవలు అందుబాటులో ఉండవు. నేలపట్టులో పక్షులతోపాటే సందర్శకుల విడిదికి భద్రమైన ఏర్పాట్లు లేవు. ఇక్కడ ఒక రోజంతా కుటుంబాలు ఆహ్లాదంగా గడిపేలా ఏర్పాట్లు, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయగలిగితే ఈ కేంద్రాలు ఆదాయ వనరులుగా మారుతాయి.

తిరుపతి అర్బన్, వాకాడు, తడ- ఆంధ్రజ్యోతి

పర్యాటక ఆదాయం పెంచుకోవడానికి అత్యధిక అవకాశాలున్న జిల్లా తిరుపతి. ఆధ్యాత్మిక పర్యాటకం, ఆహ్లాదకర పర్యాటకం, ఎకోటూరిజం కేంద్రాల అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించుకోగలిగితే భవిష్యత్తు బంగారంగా మారుతుంది. ఆధ్యాత్మిక, ఆహ్లాద క్షేత్రాలు లెక్కకు మిక్కిలిగా జిల్లాలో ఉన్నాయి. విశాలమైన ఆరు వరుసల జాతీయ రహదారిని కలిపేలా వీటికి మంచి రోడ్లు వేయగలిగితే అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా ఇవి మారుతాయి. తిరుమలకు వచ్చే యాత్రీకులను వీటికి మళ్లించేలా టూరిస్ట్ హబ్‌గా తిరుపతి జిల్లాను మలచుకేనే అవకాశాలు మెండుగా ఉన్నాయి.



గుడిమల్లంలోని పురాతన శివలింగం

ఆధ్యాత్మిక క్షేత్రాలు: తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి వచ్చే యాత్రికులు అదనంగా ఉండి దర్శించుకోగల అద్భుత క్షేత్రాలు జిల్లాలో ఉన్నాయి. క్రీస్తు.పూర్వం నాటి గుడిమల్లం, అద్భుత శిల్పకళాశోభితమైన శ్రీకాళహస్తి, చోళులు నిర్మించిన మన్నారుపోలూరు ఆలయం, మాంబట్టు శివుడి గుడి, పులికాట్ తీరాన పంట్రంగం శివాలయం, నారాయణవనం వంటి క్షేత్రాల ప్రాశస్త్యం తెలిపే సమాచారం ప్రచారంలోకి తీసుకురావడం, ఆ క్షేత్రాలకు వెళ్లే దారులను మెరుగు పరచడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ క్షేత్రాల సందర్శనకు ఆర్టీసీ ప్యాకేజీ టూర్లు నిర్వహించవచ్చు.




మన్నారుపోలూరులోని అరుదైన గరుత్మంతుడి విగ్రహం



పంట్రంగేశ్వరుడి గుడి



మాంబట్టులోని కాశీవిశ్వేశ్వరాలయం



కొండూరుపాలెం బీచ్

ఇన్ని బీచ్‌లున్నాయి: జిల్లాలో 36 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. తూపిలిపాళెం తప్ప ఇతర బీచ్‌లు ప్రజలకు తెలియవు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పరిధిలో అనేక ప్రాంతాలను బీచ్‌లుగా అభివృద్ధి పరచే అవకాశం ఉంది. శ్రీనివాసనత్రం, కొండూరుపాళెం, వాడపాళెం, పూడిరాయదొరువు వంటి చోట్ల అద్భుతమైన బీచ్‌లను అభివృద్ధి పరచవచ్చు. ఈ ప్రదేశాలకు వెళ్లేందుకు తగిన రోడ్లు వేయడం ముఖ్యం. బకింగ్‌హాం కెనాల్ సముద్రంలో కలిసే మొగదారి ప్రాంతంలో అనేక బుల్లి దీవులుంటాయి. చెట్లు దట్టంగా ఉన్నవీ, ఒట్టి ఇసుక దిబ్బలూ ఉంటాయి. సందర్శకులు ఆహ్లాదంగా రోజంతా గడపదగ్గ ప్రదేశాలుగా వీటిని రూపొందించవచ్చు. ఇందువల్ల ఆ ప్రాంత మత్స్యకారుల కుటుంబాలకూ ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయి. పులికాట్‌లోనూ, సముద్రంలోనూ దొరికే రొయ్యలూ, చేపల వంటకాలను ప్రచారం చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించవచ్చు.



ట్రెక్కింగ్

శేషాచలం కొండల్లోని అడవులూ, జలపాతాలూ ప్రకృతిప్రియులను అలరిస్తాయి. ఇక్కడి తీర్థాల సందర్శనం గొప్ప అనుభూతిని ఇస్తుంది. దాదాపు పది ట్రెక్కింగ్ టీంలు ఈ కొండల్లోకి తరచూ వెళ్లి వస్తుంటాయి. వీటన్నింటినీ ఒక గొడుగు కిందకు తీసుకువచ్చి, భద్రత కల్పించి మార్గదర్శనం చేస్తే జిల్లా పర్యాటక పటంలో అదనపు వనరుగా అమరుతుంది.



తలకోన జలపాత సౌందర్యం

ఎకో టూరిజం: ప్రకృతిలో మమేకం అయ్యేలా చేసే తలకోన, మామండూరు మన జిల్లాలోనే ఉన్నాయి. చిక్కని అడవులు, జలపాతాలు, గలగలపారే వంకలు, చెంగున దూకే జింకలు ఉండే ఈ ప్రాంతాలు ప్రస్తుతం ఎటో టూరిస్టు కేంద్రాలుగా ఉన్నాయి. ఇక్కడ వసతులు మరింత మెరుగు పరచిపి పిల్లల ఆహ్లాదానికి అనువైన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. భద్రతకు ఢోకా లేని కేంద్రాలుగా వీటి గురించిన ప్రచారం కూడా విస్తృతంగా జరగాలి. కైలాసకోన, బత్తినయ్యకోన, ఉబ్బలమడుగు, సిద్ధులయ్యకోన వంటి జలపాతాలు కూడా జిల్లాలో చాలానే ఉన్నాయి. పర్యాటక ప్రదేశాలుగా వీటి అభివృద్ధికి తగిన ప్రణాళికలు అవసరం.



మామండూరు అడవి అందం



మాధవమాల కొయ్యబొమ్మ

హస్తకళల జిల్లా: హస్తకళలకు కూడా తిరుపతి జిల్లా కాణాచి. శ్రీకాళహస్తి కలంకారీకి ప్రపంచ గుర్తింపు ఉంది. ఫ్యాషన్ రంగంలో ఇప్పుడు కలంకారీ కీలకంగా మారింది. చేనేతకూ జిల్లా ప్రసిద్ధి. పట్టు, కాటన్ చీరలు, లుంగీలు, టవళ్లు, డ్రెస్ మెటీరియల్స్ నేసే ఊళ్లు అనేకం జిల్లాలో ఉన్నాయి. వెంకటగిరి చీరలకు అంతర్జాతీయ ఖ్యాతి ఉంది. నారాయణవనం, గొల్లపల్లి, మన్నారుపోలూరు, కారిపాకం లలో నేసే వస్త్రాలు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోని ప్రఖ్యాత షోరూంల్లో అమ్ముతున్నారు. వీటికి జిల్లాలో ప్రత్యేక అమ్మకపు కేంద్రాలు ఏర్పాటు చేయగలిగితే పర్యాటక ఆదాయంతో పాటూ నేత కార్మికులకూ ఉపయోగం కలుగుతుంది. మాదవమాల కొయ్యబొమ్మలకు నిలయం. శ్రీకాళహస్తిలో, తిరుచానూరులో ఎన్నో రకాల కొయ్యబొమ్మలు తయారు చేస్తారు. రాతి శిల్పాలు చేసే కేంద్రాలు కూడా తిరుపతిలో ఉన్నాయి. వీటన్నింటినీ పర్యాటక ఆదాయ వనరులుగా మార్చుకునే ప్రణాళికలు రూపొందించుకోవాల్స ఉంది.



కాళహస్తి కలంకారీసొగసు

'ఐఐటీ తిరుత్సవ్'కు సిద్ధం

● ఫిబ్రవరి 21 నుంచి

టెక్నో కల్చరల్ ఫెస్ట్‌కు 3డీ మ్యాప్ విడుదల



ఏర్పేడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ తిరుత్సవ్-2025 వేడుకలకు సిద్ధమైంది. ఫిబ్రవరి 21 నుంచి 23వ తేదీ వరకు ఐఐటీ ప్రాంగణంలో మూడు రోజుల పాటు ఈ వార్షిక టెక్నో కల్చరల్ ఫెస్ట్ జరగనుంది. ఈ వేడుకల్లో పలు ఈవెంట్లు, సాంకేతిక పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వర్క్‌షాపులు, ఎగ్జిబిషన్లు ఉండనున్నాయి. ఆకట్టుకునే సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ విద్యార్థులు పోటీపడనున్నారు. తిరుత్సవ్ సన్నాహాల్లో భాగంగా ఐఐటీ కళాశాల క్యాంపస్‌లో ఇంటరాక్టివ్ నేపథ్య 3డీ మ్యాప్‌ను విద్యార్థులు అభివృద్ధి చేశారు. ఈవెంట్‌కు హాజరయ్యే వారికి ఆకర్షణీయమైన సాధనంగా 3డీ క్యాంపు మ్యాప్ ఉంటుందని విద్యార్థులు భావిస్తున్నారు.ఈ వేడుకలను అట్టహాసంగా జరపడానికి విద్యార్థులు కమిటీలు ఏర్పాటు చేసుకుని ముందస్తుగా 3డీ మ్యాప్‌ను మీడియాకు రిలీజ్ చేశారు.

కల్కి ట్రస్ట్ భూ ఆక్రమణలపై ఎన్జీటీలో కేసు పెట్టా: నార్నె

తిరుపతి(ఆటోనగర్), జనవరి24(ఆంధ్రజ్యోతి): కల్కి ట్రస్ట్ భూ ఆక్రమణలు, అక్రమాలపై మద్రాసు నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ)లో కేసు నమోదు చేశామని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బీఎన్ కండ్రిగ మండలం కల్లివెట్టు సమీపం సర్వే నెంబరు 295లోని అంజూరు సమీపంలోని అటవీశాఖలో 20.75 ఎకరాల డీప్ ఫారెస్ట్ భూమిని కల్కి ట్రస్ట్ నిర్వాహకులు ఆక్రమించి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నారన్నినరు. దీనిపై అటవీ, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. అందుకని కల్కి ఆశ్రమ నిర్వాహకులు, అటవీ శాఖ అధికారిని బాధ్యులుగా చేసి నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో కేసు వేశామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్ ఏఆర్ రెడ్డి, బాధితుడు మునిచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎఫ్‌ఏలు, ఒక టీఏ సస్పెన్షన్

● జరిమానా, రికవరీ వెంటనే చెల్లిస్తేనే ఉద్యోగం ● పీడీ శ్రీనివాసప్రసాద్

కేవీబీపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడిన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను, ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను పీడీ శ్రీనివాసప్రసాద్ సస్పెండ్ చేశారు. అలాగే జరిమానా, రికవరీ వెంటనే చెల్లిస్తేనే ఉద్యోగాలు ఉంటాయని అవకతవకలకు పాల్పడిన ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. కేవీబీపురంలో 2023 ఏప్రిల్ నుంచి 24 ఏప్రిల్ వరకు ఉపాధి హామీలో జరిగిన రూ.10,95,77,000 విలువైన పనులపై శుక్రవారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 38 పంచాయతీల్లో జరిగిన పనుల రికార్డులను ఆయన పరిశీలించారు. ఎక్కువ అవినీతికి పాల్పడిన మఠం ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, రంగయ్యగుంట ఫీల్డ్‌అసిస్టెంట్ అంకయ్యను, టీఏ వెంకటయ్యను సస్పెండ్ చేశారు. విధుల్లో అలసత్వం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు, ఏపీవోకు రూ.1,40,500 జరిమానా విధించారు. అలాగే అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర సిబ్బంది నుంచి రూ.8,41,900 రికవరీ చేయాలని ఎంపీడీవో, ఏపీడీని ఆదేశించారు. మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ లేనిచోట్ల పదిరోజుల్లో ఆయా రిజర్వేషన్ల ఆధారంగా వెంటనే భర్తీ చేయాలని తెలిపారు. మరణించిన వారి పేరుతోనూ బిల్లులు చెల్లించారనే అభియోగాలపై విచారణ చేయాలని ఏపీడీ ప్రేమ్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాధారాణి, ఏపీవో, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు, మండల నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తును రాజకీయం చేయొద్దు

తిరుపతి(వైద్యం), జనవరి 24(ఆంధ్రజ్యోతి): నిజానిజాలు తెలుసుకోకుండా చిన్నారుల భవిష్యత్తును రాజకీయం చేయడం సబబు కాదని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. నగరిలో లైగింక వేధింపులకు గురై స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని ఆయన శుక్రవారం పరామర్శించారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. మానవీయ కోణంలో చూడాల్సిన ఈ విషయాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని హితవుపలికారు. ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. చిన్నారిపై అత్యాచారం జరిగిందా లేదా అనే విషయాన్ని వైద్య పరీక్షల అనంతరమే వెల్లడిస్తామని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

పశు ఆరోగ్య శిబిరాల్లో 10,186 మంది రైతులకు లబ్ధి

శ్రీకాళహస్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న పశువైద్య శిబిరాల్లో తొలి నాలుగు రోజుల్లోనే 10,186మంది పాడి రైతులకు ప్రయోజనం కలిగిందని తిరుపతి డివిజన్ పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఉమామహేశ్వరి తెలిపారు. శ్రీకాళహస్తి మండలంకాపుగున్నేరి, తొట్టంబేడు మండలం చియ్యవరంలో పశువైద్య శిబిరాలను శుక్రవారం ఆమె సందర్శించారు. శ్రీకాళహస్తి పశుసంవర్థక శాఖ ఏడీ ఎన్‌వీ శ్రీకాంత్‌బాబు, పశువైద్యాధికారులు ఉష, రవీంద్రవర్మ పాల్గొన్నారు. కాపుగున్నేరిలో జరిగిన పశువైద్యశిబిరంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు పాడి రైతులకు మందులను అందజేశారు.

పర్యావరణ నియమాలు కచ్చితంగా పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణయ్య, సెల్వం, రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ నియమ నిబంధనలను పరిశ్రమలు కచ్చితంగా పాటించాలని తిరుపతి సర్కిల్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సీ.సెల్వం కోరారు.స్థిరమైన వ్యర్థాల నిర్వహణ, వనరుల సామర్థ్యం ప్రాధాన్యతను వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (ఏపీపీసీబీ) శ్రీసిటీతో కలిసి శుక్రవారం 'రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) సర్క్యులర్ ఎకానమీ' అనే అంశంపై శ్రీసిటీలో సదస్సు నిర్వ హించింది. పరిశ్రమల ప్రతినిధులు, అటవీ అధికారులు, పర్యావరణ నిపుణులు పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలు వాటి వ్యర్థాలను సమీప అటవీ ప్రాంతాలు, నీటి వనరులలో వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమలు సుస్థిర పర్యావరణ వ్యవస్థలుగా ఎలా రూపాంతరం చెందుతాయి అనే దానికి శ్రీసిటీ చక్కని ఉదాహరణగా ఏపీపీసీబీ చైర్మన్ పీ.కృష్ణయ్య పేర్కొన్నారు. మిచిగాన్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ సుధాకర్ జీ.రెడ్డి తన వర్చువల్ ప్రసంగంలో సుస్థిరత, వ్యర్థాల నిర్వహణకు సంబంధించి అమలులో ఉన్న ప్రపంచ అత్యుత్తమ పద్ధతులను వివరించారు. శ్రీసిటీ పరిశ్రమలకు చెందిన 100కు పైగా హెచ్‌ఆర్‌లు, పలు విభాగాల మేనేజర్లు పాల్గొన్నారు.

శ్మశానం చేరాలంటే నది దాటాల్సిందే..!



ఏర్పేడు మండలం ఎండీపుత్తూరులో ఎవరైనా చనిపోతే అంత్యక్రియల కోసం శ్మశానం చేరాలంటే నది దాటాల్సిందే. గ్రామం పక్కనే ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది ఒడ్డున దహన సంస్కారాలు నిర్వహించేవారు. ఇటీవల వర్షాలకు ప్రవాహం అధికమైంది. నది దాటడానికి అనుకూలంగా లేదు. ఈ క్రమంలో గురువారం చింత పుట్టాలమ్మ(98) మృతిచెందగా.. శుక్రవారం ఉదయం మెడలోతు నీటిలో మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. మిగతా బంధువులంతా అవతలి ఒడ్డుకు వెళ్లలేక ఇవతలే ఉండిపోయారు. అధికారులు స్పందించి తమ గ్రామ శ్మశాన సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

\- ఏర్పేడు

తొక్కిసలాటలో మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం



తిరుమల, జనవరి24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన మల్లిక కుటుంబానికి రూ.25 లక్షల పరిహారాన్ని టీటీడీ బోర్డు సభ్యులు శుక్రవారం అందజేశారు. పరిహారం చెక్‌ను మల్లిక కుమారుడు రమేష్‌కు టీటీడీ సభ్యులు నరేష్‌కుమార్, రామ్మూర్తి, శాంతారాం, కృష్ణమూర్తి అందజేశారు. టీటీడీ బోర్డు తీర్మానం ప్రకారం పరిహారం చెల్లించగా, బాధితుల కుటుంబంలో ఒకరికి టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగం ఇచ్చేందుకు వారి కుటుంబ సభ్యుల వివరాలను బోర్డు సభ్యుల బృందం తీసుకుంది.

ఇందిరానగర్ సచివాలయం అప్పగింత



సమీక్షిస్తున్న డీఎల్‌డీవో

వరదయ్యపాళెం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్ సచివాలయాన్ని సర్పంచ్ సల్లా వీరభద్రం సూళ్లూరుపేట డీఎల్‌డీవో బాలిరెడ్డికి అప్పగించారు. ఇందిరానగర్ సచివాల యాన్ని ఇంకా ప్రారంభించలేదని బీజేపీ నేత గుత్తిత్యాగరాజు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎల్‌డీవో శుక్రవారం ఎంపీడీవో కార్యాల యానికి విచ్చే శారు. ఎంపీడీవో ప్రసాద్, ఇతర అధికారులతో సమీక్షించారు. సర్పంచ్ సల్లా వీరభద్రంతో మాట్లాడి సచివాలయ తాళాలు తీసుకున్నారు. డీఎల్‌డీవో ఆ తాళాలను ఎంపీడీవో అందిం చారు. విద్యుత్ వసతి లేకపోవడంతో ఏఈతో చర్చించి వెంటనే కరెంటు వసతి ఇవ్వాలని ఆదేశించారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాళహస్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై హమాలీల సమస్యలు పరిష్కరిం చాలని సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూని యన్ జిల్లా కార్యదర్శి అయ్యప్ప కోరారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్ర వారం శ్రీకాళహస్తిలోని సివిల్ సప్లై పాయింట్ లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కూలీ రేట్లు పెంచి జీవోను విడుదల చేయాలన్నారు. పనిబిల్లు ప్రతి నెలా 19వ తేదీ లోపు హమాలీల ఖాతాల్లో జమ చేయాలన్నారు. పని మానుకున్న వారికి పీఎఫ్ డబ్బులు క్లెయిములు వెంటనే ఇప్పించాల న్నారు. ఈఎస్ఐ అమలుకు అన్నివిధాలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గురవయ్య, గోపి, శివకుమార్, చారుశీల, గోదాము మేస్త్రీ గిరి, రుక్కు, బాబురాజ్ పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నెల్లూరు వేదికగా ఫిబ్రవరి 1, 2, 3వ తేదీలలో జరిగే సీపీఎం రాష్ట్ర 27వ మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపు నిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శుక్రవారం రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు సీపీఎం నేతలు బీవీ రాఘవులు, బృందాకారత్ హాజరవు తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, వెలివేంద్రం, గురునాథం, గురవయ్య, సంక్రాంతి వెంకటయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం



శ్రీకాళహస్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థినికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా శుక్రవారం ఆర్థికసాయం చేశారు. పట్టణానికి చెందిన యామిని ఓ ప్రైవేటు కళాశాలలో చదువు తోంది. కళాశాల ఫీజు చెల్లించలేక విద్యా భ్యాసాన్ని నిలిపివేసింది. ఈ విషయం తెలుసుకున్న మునీర్‌బాషా శుక్రవారం రూ.12వేలు అందజేశారు. యామిని వారికి కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గరికపాటి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో వన్నెకుల క్షత్రియులకు ప్రత్యేక స్థానం



సీఆర్ రాజన్ తదితరులకు సన్మానం

శ్రీకాళహస్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో వన్నెకుల క్షత్రియులకు ప్రత్యేకస్థానం ఉందని ఆ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్‌రావు అన్నారు. శుక్రవారం విజయ వాడలో బీసీ సంక్షేమ భవన్‌లో వన్నెకుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేసిన పట్టణానికి చెందిన మిన్నల రవి, చిన్నారెడ్డి, తేజోవతితో పాటు చైర్మన్ సీఆర్ రాజన్‌ను ఆయన ఘనంగా సన్మానించారు. టీడీపీ నాయకులు నెమళ్లూరు బుజ్జి, మునిరాజా యాదవ్, కోట చంద్రశేఖర్, చింతగింజల సునీల్, మణి, శివ, చంద్ర పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలను నివారించాలి

శ్రీకాళహస్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం అధికారి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా గణాంక అధికారి నాగేంద్రకుమార్, నరేష్, డీపీవో ప్రకాష్‌తో కలిసి పట్టణంలోని గజేంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం సందర్శిం చారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు స్రవంతి, నయనార్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఆదిమూలం



ప్రహరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నారాయణవనం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. రూ.7లక్షల వ్యయంతో నిర్మించిన విద్యాశాఖాధికారి కార్యాలయ ప్రహరీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ప్రహరీ నిర్మాణానికి 5 లక్షల జడ్పీ నిధులు, 2 లక్షలు మండల పరిషత్ నిధులు వెచ్చించినట్లు ఎంఈవో ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటీసీ సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ఎంపీడీవో గుణశేఖర్, టీడీపీ నాయకులు భాస్కరన్, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఇద్దరికి తీవ్ర గాయాలు

రేణిగుంట, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం గాజుల మండ్యం వద్ద చోటుచేసుకుంది. తిరుచానూరుకు చెందిన ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీజరాణి, విద్యార్థిని అభిజితారాణి ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంలో వెళు తుండగా గాజులమండ్యం వద్ద పుత్తూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్దారు. స్థానికులు వారిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తూరు వార్తలు

మహిళలపై వివక్ష శోచనీయం





డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న శ్రీదేవి, వడమాలపేటలో ర్యాలీ

పుత్తూరు/ వడమాలపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల వివక్ష విచారకరమని స్త్రీ సాధికార సంస్థ కన్వీనర్ శ్రీదేవి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం స్త్రీ సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ బాలికా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భ్రూణ హత్యలు, హత్యా చారాలను నివారించాలని కోరారు. ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసు కోవాలని కోరారు. అలాగే బాలికల జూని యర్ కళాశాల, గోపాలకృష్ణాపురం గురుకుల, పాలి టెక్నిక్ కళాశాలలు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలికల జూనియర్ కళాశాలలో ఆటలపోటీలు, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. డిగ్రీ కళాశాలలో అధ్యా పకులు దేవకి, వాసవి, లక్ష్మీబాయిలు, జూనియర్ కళాశాలలో ప్రధానోపాధ్యా యురాలు భువనేశ్వరి, గురుకుల పాఠశాలలో అధ్యాపకులు చంద్రకళ, పాలిటెక్నిక్ కళాశాలలో కుమార్, మంజుల, జానకి, ఐసీడీఎస్ లో గీతాంజలి, సంధ్య, సంతోషి భానుమతి, శ్రీదేవి, జ్యోతి పాల్గొన్నారు. ● వడమాలపేటలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం విమల, అంగన్వాడీ సూపర్ వైజర్లు రోజారమణి, మనీలా, అంగన్వాడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రకు ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి, జవని 24(ఆంధ్రజ్యోతి): మంత్రి కొల్లు రవీంద్రను ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను ముక్కంటి దుశ్శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానించారు. తప్పకుండా వస్తానని, ఎంజీఎం సంస్థలను సందర్శిస్తానని ఆయన తెలిపారు.

పవార్ ఇంట్లో ఎమ్మెల్యే కన్నా ఆతిథ్యం

శ్రీకాళహస్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మున్సిపల్ మాజీ చైర్మన్, ముక్కంటి ఆలయ మాజీ చైర్మన్ దివంగత శాంతారామ్ పవార్ ఇంట్లో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ఆతిథ్యం స్వీకరించారు. ముక్కంటి ఆలయ దర్శనానంతరం శాంతారాం పవార్ ఇంట్లో అల్పాహారం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీవీఆర్ గ్రూప్ డైరెక్టర్స్ జనార్ధన్‌రావు పవార్, పరమేశ్వరరావు పవార్, జీవీ రమణమూర్తి, పదోల్కర్ మహేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగలో మంజూరైన సిమెంట్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని డ్వామ పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. మండలంలోని కాటూరులో నిర్మించిన సిమెంట్ రోడ్డును శుక్రవారం ఆయన పరిశీలించారు. మండలంలో ఇంకా వేయవలసిన సిమెంట్ రోడ్ల గురించి పంచాయతీ రాజ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు వీఎస్‌పురంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో భానుప్రియ పాల్గొన్నారు.

పులికుండ్రంలో పశువైద్య శిబిరం

పిచ్చాటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలంలోని పులికుండ్రం పంచాయతీలో శుక్రవారం పశు సంవర్ధకశాఖ డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులికుండ్రం సర్పంచ్ దిలీప్, ఎంపీటీసీ రమేష్‌రాజు, పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన

పిచ్చాటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడియూరు సబ్‌స్టేషన్ నిర్మాణానికి ట్రాన్స్‌కో ఈఈ దేవ ఆశీర్వాదం శుక్రవారం కొత్త గొల్లకండ్రిగ వద్ద స్థల పరిశీలన చేశారు. సర్వే నెం.1082లో రెండు ఎకరాల భూమిని గుర్తించారు. సబ్‌స్టేషన్‌తో పాటు సోలార్ ప్లాంటు ఏర్పాటుకు అనువుగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ సుబ్రహ్మణ్యం రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వికృతమాల చెరువు వేలం

ఏర్పేడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వికృతమాల చెరువు వేలం పాట శుక్రవారం జరిగింది. పెరుమాళ్ అనే వ్యక్తి రూ.2.10లక్షలకు పాడుకున్నారు. అదేవిధంగా పోలేగుంట చెరవును యుగంధర్ రూ.25వేలకు దక్కించుకున్నారు.

కావమ్మకు ప్రత్యేక పూజలు

నాగలాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం రెడ్డివీధిలోని కావమ్మ సమేత మారయ్య ఆలయంలో తైనెల శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామి, అమ్మవారికి అభిషేకాలు చేసి దీప ధూప నైవేద్యాలు సమర్పించారు. వివిధ పుష్పాలతో, పట్టువస్త్రాలతో సుందరంగా ముస్తాబు చేసి మహా హారతి చేపట్టారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పొంగళ్లు పెట్టారు.

వైసీపీ నాయకుడికి రోజా పరామర్శ

పిచ్చాటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నింద్రకు చెందిన వైసీపీ నాయకుడు సుబ్రహ్మణ్యంయాదవ్‌ను మాజీ మంత్రి రోజా పరామర్శించారు. స్థానిక టీచర్స్ కాలనీలో ఉంటున్న సుబ్రహ్మణ్యయాదవ్‌కు ఇటీవల ఓపెన్‌హార్ట్ సర్జరీ జరిగింది. ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాడు. శుక్రవారం రోజా ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. నింద్ర ఎంపీపీ దీప తదితరులు ఉన్నారు.

తల్లి గర్భం నుంచే బాలికలపై వివక్ష



పాపానాయుడుపేటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి/ బుచ్చినాయుడుకండ్రిగ/ నాగలాపురం/ వరదయ్యపాళెం/ సత్యవేడు / పిచ్చాటూరు జనవరి 24(ఆంధ్రజ్యోతి): తల్లి గర్భం నుంచే బాలికల పట్ల వివక్ష ఏర్పడుతోందని ప్రగతి సంస్థ మండల కో-ఆర్డినేటర్ సుభాష్ అన్నారు. మండలంలోని పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, జూనియర్ కళాశాల అధ్యాపకురాలు ఉమ పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ సిబ్బంది సుమలత, రాజేశ్వరి, హెల్త్ సిబ్బంది ఉష, అంగన్వాడీ టీచర్ శారదమ్మ, శంషాద్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వనజ పాల్గొన్నారు. ● ప్రధానోపాధ్యాయులు రమణయ్య ఆధ్వర్యంలో బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, నారాయణ వనం మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో, పాఠశాలల్లో బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● ప్రిన్సిపాల్ శ్రీలత ఆధ్వర్యంలో నాగలాపురంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికా దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి పాల్గొన్నారు. ● వరదయ్యపాళెం, మండలంలోని బత్తలవల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శిల్ప, బజావతి, ఉపాధ్యాయులు పరంధామయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు. ● సత్యవేడు మండలంలోని దాసుకుప్పం హైస్కూల్లో హెచ్ఎం వడివేలు ఆధ్వర్యంలో బాలికలకు హక్కులపై అవగాహన కల్పించారు. దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ ఎంపీహెచ్ఈవో సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం నిర్వహించారు. ● పిచ్చాటూరు మండలం లోని పులియంగుంట జడ్పీ హైస్కూలు ప్రాంగణంలో అంగన్వాడీల ఆధ్వర్యంలో బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. సీడీపీవో శోభారాణి, సూపర్‌వైజర్లు మారెమ్మ, బేబి, సుమతి, ప్రధానోపాధ్యాయుడు రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్‌బాబు

శ్రీకాళహస్తి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య తిరుపతి జిల్లా రెండవ మహాసభ పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకుని యువతకు ఉపాధి కల్పించి దేశ అభివృద్ధిలో వారిని భాగ స్వామ్యం చేయాలన్నారు. రాజధాని అమరావతిని ఫ్రీజోన్ చేసి అక్కడ భర్తీ చేసే ప్రభుత్వ ఉద్యోగాలలో 26 జిల్లాల నిరుద్యోగులకు అవకాశం కల్పిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో రామా నాయుడు, కత్తి రవి, జనమాల గురవయ్య, బండి చలపతి, ప్రవీణ్ పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఏర్పాటు

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడుగా జయకృష్ణ, ఉపాధ్యక్షులుగా నాగరాజు, భానుచంద్ర, నాగార్జున, కార్యదర్శిగా రామకృష్ణ తదితరులను ఎన్నుకున్నారు.

వరదయ్యపాళెం: శ్రీకాళహస్తిలో జరిగే ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలకు మండలం నుంచి సీపీఐ మండల కార్యదర్శి కతారి తరుణ్‌కుమార్, ఏఐవైఎఫ్ నాయకులు మురళి, నాగార్జున, ప్రతాప్, వెంకటేష్, సురేష్, మునిశేఖర్, ప్రేమ్‌కుమార్, రాఘవేంద్ర తదితరులు వెళ్లారు.

ఘనంగా బాలికల దినోత్సవం

రేణిగుంట, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శ్రీశిశు సంక్షేమ శాఖ మిషన్, వాత్సల్య రాస్ చైల్డ్ ఫండ్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. అంతకు ముందు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో శవశంకర్, రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి, హెచ్ఎం విష్ణువర్ధని, మిషన్ వాత్సల్య సిబ్బంది కల్పన, అనంతలక్ష్మి, వెంకటరమణ, మహిళా పోలీసులు పూర్ణిమ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన

కేవీబీపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతపాళెం పంచాయతీలో శుక్రవారం పశువైద్యాధికారి హరీష్ ఆధ్వ ర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని బీజేపీ మండ లాధ్యక్షుడు బాబుయాదవ్ ప్రారంభించారు. డాక్టర్ పశువులను పరీక్షించారు. రైతులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

ఏర్పేడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికల కోసం మరుగుదొడ్ల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. హెచ్ఎం ఆనంద్ చొరవతో తిరుపతి ఎంపీ గురుమూర్తి తన నిధుల నుంచి రూ.5లక్షలు కేటాయిం చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, రాజా, రమణయ్యనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకగా ఊంజల్ సేవ

నారాయణవనం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో వెలసిన కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల్ సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం నిత్య కైంకర్యాలు నిర్వహించి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. సాయంత్రం వేద పండితుల మంత్రోచ్చరణలతో ఊంజల్ సేవ నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

డ్రైనేజీ పూడ్చివేతపై టీడీపీ నాయకుల ఆగ్రహం



పూడ్చివేసిన కాలువను చూపుతున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోట గ్రామంలోని మూడేళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీ కాలువను పూడ్చివేయడంపై ఆ గ్రామ టీడీపీ నాయకులు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ అధ్యక్షుడు నరసింహులు, బూత్ కన్వీనర్ మునిబాబు మాట్లాడుతూ సూళ్లూరుపేట రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం వెళ్లే దారిని సిమెంటు రోడ్డుగా మార్చారన్నారు. రోడ్డు వెంట డ్రైనేజీ కాలువ నిర్మిం చారన్నారు. అయితే వైసీపీ మండల అధ్యక్షుడు, నీర్పాకోట సర్పంచ్ విద్యానాథరెడ్డి గురువారం కాలువపై పరిచిన బండలు తీసుకుపోయారని తెలిపారు. శుక్రవారం కాలువకు మట్టిని తోలి పూడ్చివేశారని తెలిపారు. ఈ విషయం పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. నాయకులు దిలీప్‌కుమార్, వీరరాఘవులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

పిచ్చాటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రెప్పాలపట్టు యానాది కాలనీలో ఓ పూరిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. తుపాకుల శీను, కార్తీక దంపతులు తమ ఆరేళ్ల, పాప, రెండేళ్ల కుమారుడితో కలిసి జీవిస్తున్నారు. శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో అందరూ కలిసి భోజనం చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. గుడిసెకు మంటలు వ్యాపించాయి. వెంటనే అందరూ వచ్చేశారు. మంటలు ఆర్పేలోగా ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంటిలోని వస్తువులు, ధాన్యం నగదు, దుస్తులు దగ్ధమయ్యాయి. దాదాపు లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

వీళ్లకు ట్రాఫిక్ రూల్స్ వర్తించవా..!



తపాలా శాఖకు ట్రాఫిక్ నిబంధనలు వర్తించవా.. అతిక్రమించినా పట్టించుకోరా..? అంటే అవుననే చెప్పాలి. పట్టణంలోని బజారువీధిలో శుక్రవారం తపాలా శాఖాధికారి వాహనాన్ని నోపార్కింగ్ సూచిక బోర్డు ఉన్న చోటే నిలిపి ఉంచడం ఇందుకు నిదర్శనం. పోస్టాఫీసులో తనిఖీల నిమిత్తం వచ్చిన అధికారులు ఈ వాహనాన్ని అక్కడ నిలిపి వెళ్లినట్లు తెలిసింది. - రేణిగుంట

నిధులు సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పిటీసీ సుమన్‌కుమార్

నారాయణవనం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు మంజూరైన నిధులు వెనక్కి పోకుండా సకాలంలో వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం సూచిం చారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ దివాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలని పేర్కొన్నారు. అధికారులు అభివృద్ధి పనుల సమాచారాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులకు ఎందుకు తెలియజేయడం లేదని ప్రశ్నించారు. కైలాసనాథకోనలో అనధికారికంగా నిర్వహిస్తున్న రిసార్ట్‌లను మూసి వేయాలని, అక్రమ కట్టడాలను తొలగించాలని కార్యదర్శికి సూచించారు. రిసార్ట్‌లకు గృహ విద్యుత్ సర్వీసును తొలగించి కేసులు నమోదు చేయాలని విద్యుత్ శాఖాధి కారులను కోరారు. అనంతరం జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ మాట్లాడుతూ పాలమంగళం నార్త్ వద్ద నదిపై వంతెన పనులను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకుని రావాలని, పెండింగ్ పనులను పూర్తిచేసి నారాయణవనంలో అంగన్వాడీ కేంద్ర భవనాన్ని త్వరలో ప్రారంభించాలని సూచించారు. నారాయణవనం ట్రంకు రోడ్డు ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ, ఆర్ అండ్ బీ అధికారులను కోరారు. ఆక్రమణలకు గురవుతున్న అక్కసాని గుంటను రక్షించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో గుణశేఖర్, తహసీల్దార్ జయరాములు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.